క్లుప్తంగా

యాదవులకు సముచిత స్థానం కల్పించాలి

కామేపల్లి: రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షుడు మేకల మల్లిబాబుయాదవ్ ఆధ్వర్యాన యాదవుల నాయకులు బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలో యాదవులకు సముచిత స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన రిటైర్డ్ పోలీస్ ఉద్యోగి వనవాసం రవీందర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా బుధవారం 17వ డివిజన్‌లోని శ్రీ సత్యసాయి ఆశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు ధనాల రమణ, లగడపాటి వెంకటేశ్వరరావు, దిరిశాల శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



నగదు అందిస్తున్న నర్సింహారెడ్డి

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురంకు చెందిన ఈర్ల రేసుఖకు తిరుమలాయపాలెం సబ్ పోస్టాఫీస్‌లో బుధవారం రూ.10లక్షల ప్రమాద బీమా చెక్కును బ్రాంచ్ పోస్‌మాస్టర్ తిప్పిరెడ్డి నర్సింహారెడ్డి అందించారు. రేసుఖ తల్లి అయిన ముత్తెబోయిన నర్సమ్మ పోస్టాఫీస్‌లో టాటా ఏఐజీ పాలసీ తీసుకుని ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. దీంతో ఆమె నామినీగా ఉన్న కూతురు రేసుఖకు బీమా నగదును అందించారు. ఈ కార్యక్రమంలో ఏబీపీఎం అరుణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో హోంగార్డు మృతి



నగదు అందిస్తున్న ఆర్ఐ సురేష్

ఖమ్మంక్రైం: ఖమ్మంలో ట్రాఫిక్ విభాగంలో హోంగార్డుగా పనిచేస్తున్న ఎండీ అబ్దుల్‌మునీర్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగవారం రాత్రి మృతి చెందాడు. ఈమేరకు హోంగార్డు ఆర్ఐ సురేష్ సందర్శించి అంత్యక్రియలకు ప్రభుత్వం ద్వారా అందజేసే రూ.10వేలను మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెడ్ కానిస్టేబుల్ దత్తురామ్, హోంగార్డు సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహమ్మద్ రఫీ, కార్యదర్శి ముత్తజ, హోంగార్డులు వెంకన్న, రామకృష్ణ, రమేష్, హోంగార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

వృద్ధులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: వృద్ధులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, వారి వసతులపై చర్యలు తీసుకోవాలని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఖమ్మం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంఘ జిల్లా గౌరవ సలహా సభ్యులుగా ఆర్.రవీందర్‌రావు, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ సుశీల, ఎర్నేని రామారావు, కల్యాణం కృష్ణయ్యలను ప్రకటించారు. ఈమేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి సాధినేని జనార్దన్‌రావు, కోశాధికారి కొత్త సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి గుడిమళ్ల సూర్యప్రకాశరావు, నరసయ్య, సభ్యులు జిల్లా వెంకటేశ్వర్లు, అనాశి రాధాకృష్ణ, గజేంద్రుల నాగేశ్వరరావు, గుడ్ల నరసింహారావు, వీరభద్రం, పుల్లారావు, శ్రీహరి, రచ్చ రామారావులు వారిని అభినందించారు. ఈ సమావేశంలో ఉపేందర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రావు, తాత రాఘవయ్య, యాకుబ్‌బేగ్, కుటుంబరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కల్కి
వినోద	శివం భజే
సాయిరాం	బుడ్డి
ఆదిత్య	ఉషా పరిణయం
శ్రీనివాస	రాయన్

- ఖమ్మంగాంధీచౌక్



తిరుమలాయపాలెం: బీసురాజుపల్లితండా వద్ద పొంగిపొర్లుతున్న ఆకేరు చెక్‌డ్యామ్



ఖమ్మంలో వర్షంలోనే డ్యూటీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్సై

ముసురేసింది..



ఖమ్మంఅర్బన్: మున్నేరు చెక్‌డ్యామ్‌పై పొంగి ప్రవహిస్తున్న వరదనీరు

గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానతో జనజీవనం స్తంభించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీగా కురవడంతో లోతట్టు ప్రాంతాలతో పాటు రోడ్లు, ఖాళీ స్థలాలు, పంట పొలాలు జలమయమయ్యాయి. చెరువులు, కుంటలు పొంగి ప్రవహించడంతో పలుచోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. కాగా, నగరంలో నిలిచిన నీటిని తొలగించేందుకు రోడ్లు, డ్రెయినేజీలను పగలగొట్టడం, కచ్చా కాల్వలు తీయడం, మోటార్ల ద్వారా తోడించడం వంటి పనులు చేపట్టారు. పాఠశాలు, వీధుల్లో వర్షపు నీరు నిలవగా.. విద్యార్థులు, స్థానికులు ఇబ్బంది పడ్డారు. చెట్లు విరిగిపడి పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. – సాక్షి నెట్‌వర్క్

కొత్త బస్టాండ్ కురుస్తోంది..!

ఖమ్మంమయూరిసెంటర్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో ఖమ్మం కొత్త బస్టాండ్ కురుస్తోంది. 9, 10, 18, 23, 25, 26 ప్లాట్‌ఫామ్‌లతో పాటు పలు చోట్ల కురుస్తుండడంతో ఆర్టీసీ సిబ్బంది ఇదిగో ఇలా బకెట్లను ఏర్పాటు చేశారు. మరికొన్ని చోట్ల వీటిని పెట్టకపోవడంతో తడిగా మారుతుంది. దీంతో స్వీపర్లు ఆ నీటిని తుడిచే పనిలో నిమగ్నమయ్యారు. ఈనేపథ్యాన కొన్ని నేమ్ బోర్డులకు సంబంధించిన విద్యుత్‌ను సిబ్బంది నిలిపివేయడం గమనార్హం.







రఘునాథపాలెం: వీఆర్‌బంజర పాపటపల్లి మధ్య పొంగుతున్న బుగ్గవాగు



ఖమ్మంఅర్బన్: ధంసలాపురం పెద్ద చెరువు అలుగు వద్ద గుర్రపు డెక్కను తొలగిస్తున్న మత్స్యకారులు



రఘునాథపాలెం: రాంక్యాతండా, పుఠానితండా మధ్య వరద పారడంతో నిలిచిన రాకపోకలు



ఖమ్మంమయూరిసెంటర్: మిషన్ ద్వారా రాజేంద్రనగర్ పాఠశాలలోని నీటిని తొలగిస్తున్న కేఎంసీ సిబ్బంది



ఖమ్మం: వర్షంలో ఇబ్బంది పడుతూ వెళ్తున్న వాహనదారులు



కామేపల్లి: మర్రిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలోకి చేరిన వర్షపు నీరు



నేలకొండపల్లి: మంగాపురంతండా అంగన్‌వాడీ కేంద్రంలో..



కొండపల్లి: మంగాపురంతండా పాఠశాలలో నిలిచిన నీరు



తిరుమలాయపాలెం: అలుగు పోస్తున్న హస్నాబాద్ చెరువు



ఖమ్మంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద రోడ్డుపై చేరిన నీటిని డ్రెయినేజీలోకి మళ్లిస్తున్న కార్మికులు



ఖమ్మంమయూరిసెంటర్: 34వ డివిజన్‌లో వర్షానికి కూలిన చెట్టును తొలగిస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది



ఖమ్మంలోని ఐటీ హబ్ వద్ద డ్రెయినేజీలో వ్యర్థాలను తొలగిస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది



కామేపల్లి: బుగ్గవాగు ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రవీందర్, అధికారులు

మురుగు సమస్య లేకుండా చూడాలి

ఖమ్మంఅర్బన్: నగరంలోని 8వ డివిజన్ వైఎస్ఆర్ నగర్ డబుల్‌బెడ్రూం సముదాయ ప్రాంగణంలో మురుగు నీటి సమస్య లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య సిబ్బందికి సూచించారు. బుధవారం డబుల్ బెడ్రూం సముదాయాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. మురుగు నీటితో పాటు వర్షపునీరు నిల్వ లేకుండా అవసరమైన ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలు, ఖాళీ స్థలంలో మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరిచేరవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కార్పొరేటర్ లకావత్ సైదులు తదితరులు పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

కాంగ్రెస్ సీనియర్ నాయకుడి మృతి



కన్నేటి వెంకన్న (ఫైల్)

ఖమ్మంరూరల్/ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మంమామిళ్లగూడెం: ఖమ్మంరూరల్ మండలంలోని మంగళగూడెంకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పాలేరు నియోజకవర్గ బీ బ్లాక్ మాజీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ కన్నేటి వెంకన్న(60) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. ఆయన మృతదేహం వద్ద మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాళులర్పించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకే గ్రామాభివృద్ధికి వెంకన్న చేసిన సేవలను కొనియాడారు. అలాగే, వెంకన్న మృతిపై ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ఓ ప్రకటనలో సంతాపం ప్రకటించారు. అంతేకాకుండా మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు వడ్డెబోయిన నర్సింహారావు, కాంగ్రెస్ నాయకులు తుంబూరు దయాకర్‌రెడ్డి, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, చరణ్‌రెడ్డి, దాసరి పూర్ణ, నాగిశెట్టి రాధాక్రిష్ణ, నాగభూషణం, తదితరులు కూడా నివాళులర్పించగా వెంకన్న అంతిమయాత్రలో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఏఈ ఉద్యోగానికి ఎంపిక



గార్లపాటి గోపి

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలకేంద్రంలో నివాసం ఉంటున్న రాంక్యాతండాకు చెందిన గార్లపాటి గోపి ఈ నెల 2న ప్రకటించిన ఫలితాల్లో మిషన్ భగీరథ(ఆర్‌డబ్ల్యూఎస్) ఏఈగా ఎంపికైనాడు. నగరంలోని బొమ్మ కాలేజీలో బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ అభ్యసించి పోటీ పరీక్షల్లో పాల్గొని ఉద్యోగం సాధించానని, శిక్షణ పూర్తయ్యాక పోస్టింగ్ ఇస్తారని గోపి తెలిపారు. వ్యవసాయం చేస్తూ జీవనం సాగించుకునే గోపి తల్లిదండ్రులు గార్లపాటి గురవయ్య, కస్తూరి ఆనందం వ్యక్తం చేశారు.

నిత్యావసరాల పంపిణీ

నేలకొండపల్లి: మండల కేంద్రంలో వైఎస్ఆర్ కిరాణం స్థాపించి 40 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా యాజమాని యర్రా నాగేశ్వరరావు 20 మంది నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు దోసపాటి శేఖర్, రేగూరి హనుమంతరావు, రేగూరి వాసవి, మాటూరి సుబ్రహ్మణ్యం, బ్రహ్మం, దోసపాటి రామయ్య, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి..

నేలకొండపల్లి: దివ్యాంగుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ సిత్మ సబర్వాల్‌పై వెంటనే చర్యలు తీసుకొని, కేసులు నమోదు చేయాలని దివ్యాంగుల జేఏసీ చైర్మన్ పీ.వీ. చలమయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం జేఏసీ ఆధ్వర్యాన మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసేలా మాట్లాడిన ఆమెపై చర్యలు తీసుకోవాలని, లేకుండా ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. వీరికి సంఘీభావంగా సీపీఎం మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, చిర్రా భిక్షం, రామకృష్ణ, నాగేశ్వరరావు, పుల్లయ్య, వీరన్న, సత్యనారాయణ, ప్రకాషం, బ్రహ్మయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న దివ్యాంగులు

నేడు ఎమ్మెల్యే పర్యటన

కామేపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య నేడు(గురువారం) కామేపల్లిలో పర్యటించనున్నట్లు కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్ పుచ్చకాయల వీరభద్రం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈమేరకు మండలకేంద్రంలోని రైతువేదికలో రుణమాఫీ వర్తించిన రైతులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా తిరిగి రుణాలు ఇవ్వనున్నారు.

రేపటి నుంచి పవిత్రోత్సవాలు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని స్తంభాద్రి గుట్టపై ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం నుంచి నాలుగు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించడంతో పాటు అన్నదాన కార్యక్రమం ఉండనుండగా.. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దిగ్విజయం చేయాలని ఈఓ కోరారు.

'న్యూ ఇరా'లో అవగాహన సదస్సు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని న్యూ ఇరా పాఠశాలలో ఆగస్టు 6, 1945 హిరోషిమా డే ఒక పెను వినాశనం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ భూమేశ్వరరావు, ఐకా బాలాజీలు పేర్కొన్నారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. యుద్ధం వల్ల కలిగే నష్టాలు, వాటి నివారణ అనే అంశాలపై ముందడుగు కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు.

'హార్వెస్ట్' విద్యార్థిని ప్రతిభ



మోనిషశ్రీని అభినందిస్తున్న యాజమాన్యం

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని ఎస్.మోనిషశ్రీ కరీంనగర్‌లో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం దక్కించుకుంది. సబ్ జూనియర్ బాలికల విభాగం కటాలో ప్రథమస్థానంలో నిలిచి పతకం సాధించగా.. బుధవారం హార్వెస్ట్ గ్రూప్ విద్యాసంస్థ కరస్పాండెంట్ పి.రవిమారత్, రామసహాయం పార్వతీరెడ్డిలు అభినందనలు తెలిపారు.

సైబర్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలి

ఖమ్మంక్రైం: పెట్టుబడులు, అధిక లాభాల పేరిట సైబర్ కేటుగాళ్లు వేసే వలలో పడి మోసపోవద్దని సైబర్ క్రైమ్ ఏసీపీ సీహెచ్ఆర్‌వీ.ఫణీందర్ సూచించారు. ఖమ్మంలోని కృష్ణవేణి జూనియర్ కాలేజ్‌లో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అపరిచిత వ్యక్తులు, నంబర్ల వచ్చే ఫోన్ల, మెసేజ్‌లకు స్పందించొద్దని తెలిపారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే 1930 నంబర్‌కు లేదా cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని చెప్పారు.సమావేశంలో ఖమ్మం టూ టౌన్ సీఐ బాలకష్ణ, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ ఫణీందర్

జర్నలిస్ట్ మృతికి కారకులైన వారిని శిక్షించాలి

ఖమ్మంరూరల్: జర్నలిస్ట్ వెంకటరెడ్డి మృతికి కారకులైన వారిని పోలీసులు కఠినంగా శిక్షించాలని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవిలు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వెంకటరెడ్డికి వారసత్వంగా వస్తున్న భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకుని అదే గ్రామానికి చెందిన జాటోత్ వీరన్న సాగు చేసుకుంటున్నాడని పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈమేరకు వెంకటరెడ్డి మృతికి సంతాపం తెలిపారు.

53వ డివిజన్‌లో స్వచ్ఛదనం-పచ్చదనం

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 53వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య ఆధ్వర్యాన బుధవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో పారిశుద్ధ్య పనులు చేపట్టి, నిల్వ నీటిని తొలగించారు. విష జ్వరాలు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు కార్పొరేటర్ వివరించారు. డివిజన్ ప్రత్యేక అధికారి వీరబాబు, జవనా పృథ్వి ఆర్పీలు నూర్జహాన్, విజయ, అంగన్‌వాడీలు ఈశ్వరి, వసంతలక్ష్మి, ఆశవర్కర్లు బుజ్జి, రమ్య, అధ్యక్షుడు చంద్రకాని శ్రీను, అబ్బాస్ పాల్గొన్నారు.

న్యాయవాద దంపతులపై పోలీసుల తీరు సరికాదు

ఖమ్మంలీగల్: జనగామలో ఈనెల 5న న్యాయవాద దంపతులపై పోలీస్ తీరును జిల్లా బార్ అసోసియేషన్ ఖండించింది. బుధవారం సమావేశమైన ఎగ్జిక్యూటివ్ బాడీ ఈ మేరకు తీర్మానం చేసింది. అదేవిధంగా న్యాయవాదులపై జరుగుతున్న దాడులను బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ సుమోటోగా స్వీకరించి హైకోర్టులో పిల్స్ వేయాలన్నారు. న్యాయవాదులపై దాడి చేస్తున్న పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తూ కూడా సమావేశం తీర్మానించింది.

వేతనాలు చెల్లించాలి

నేలకొండపల్లి: పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రగతి శీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియర్ జిల్లా కార్యదర్శి పగిడికత్తుల రామదాసు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు వేతనాలు అందక ఎనిమిది నెలలుగా అర్ధాకలితో విధులు నిర్వహిస్తున్నా.. పాలకులకు మాత్రం నిమ్మకు నీరెత్తిన్నట్లుగా వ్యవహరించడం దారుణమన్నారు. ఇకనైనా పెండింగ్ వేతనాలు విడుదల చేయకుంటే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు అప్పారావు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలి

నేలకొండపల్లి: విద్యా ప్రమాణాలు పెంపునకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని మండల విద్యాశాఖ నోడల్ అధికారి చలపతిరావు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ఏడాది నవంబర్‌లో 3, 6, 9 తరగతులకు చెందిన విద్యార్థులకు నిర్వహించనున్న న్యాక్ పరీక్షలకు సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు ఇటిక్యాల సురేష్, రవికుమార్, రామారావు, వెంగళరావు, నవాబు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నోడల్ అధికారి చలపతిరావు